సాక్షి
వనపర్తి
గురువారం । 19 । డిసెంబర్ । 2024



హైవేపై దారి దోపిడీ

పెబ్బేరు శివారులో మంగళవారం రాత్రి దుండగులు దారి దోపిడీకి పాల్పడ్డారు.

వివరాలు 8లో ▸



దిగి వచ్చిన ఉల్లి ధర

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి ధర గత వారం కంటే రూ.1,500 వరకు తగ్గింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /15.0

వాతావరణం

చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

20న జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలు

వనపర్తి టౌన్: జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలు ఈ నెల 20న జిల్లాకేంద్రంలోని డా. బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్, ప్రధానకార్యదర్శి బొలమోని నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 వరకు మర్రికుంట సమీపంలోని ఎకో పార్క్ దగ్గర రిపోర్ట్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్లు 99086 29908 (బొలమోని నర్సింహ), 94413 53375 (షంషీర్ అలీ), 80961 15222 (నందిమల్ల శ్రీకాంత్) సంప్రదించాలని కోరారు.

బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



వనపర్తి విద్యావిభాగం: జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం(టీబీఎస్ఎఫ్), ఎస్సీఈఆర్టీ తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో 13 మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో చదివే తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియంలో ప్రథమ బహుమతిని వైష్ణవి (జెడ్పీహెచ్ఎస్, పెద్దగూడెం), ద్వితీయ బహుమతిని కె.మల్లేశ్వరి(కేజీబీవీ, ఆత్మకూర్), ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతిని అఖిల్ (జెడ్పీహెచ్ఎస్ (బాలుర), గోపాల్‌పేట), ద్వితీయ బహుమతిని కీర్తన (జెడ్పీహెచ్ఎస్ (బాలికల), వనపర్తి) గెలుపొందారు. వీరికి డీసీబీ కార్యదర్శి చంద్రశేఖర్, కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి యుగంధర్, కమ్యూనిటీ ప్లానింగ్ అధికారి శేఖర్, ఎన్‌జీసీ కో–ఆర్డినేటర్ ఐ.సుదర్శన్ జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు. టీబీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రతాప్‌రెడ్డి, జిల్లా బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బి.మల్లేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు సాయిచందర్ రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం : సీపీఎం

వీపనగండ్ల: ప్రజా ఉద్యమాలను సమష్టిగా నిర్వహించడంతో రైతులు, కార్మికులు, పేదల సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్ అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని గోవర్ధనగిరిలో మూడురోజులుగా కొనసాగిస్తున్న రిలే దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి సర్వేలో సుమారు 130 మందికి ఇందిరమ్మ ఇళ్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మొత్తం రూ.15 లక్షలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కేటాయించాలని కోరారు. మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు పెద్ద ఖాజా, రవిప్రసాద్, మౌలాలి, శ్రీనివాసులు, శేఖర్, రజాక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

దీక్షలు విరమణ..

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సీపీఎం ఆధ్వర్యంలో మూడురోజులుగా చేపట్టిన రిలే దీక్షలను బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్ విరమింపజేశారు. తమ వినతిని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వారు హామీ ఇచ్చారు.

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి..



- డా. సతీష్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్, జిల్లా ఆస్పత్రి, వనపర్తి



నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. చలికి తట్టుకోలేక చిన్నారులు, వృద్ధులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ కాలంలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఉదయం, సాయంత్రం వేళలో ముక్కు, చెవులను కప్పి ఉంచేలా ఉన్ని దుస్తులు ధరించడంతో పాటు స్వెట్టర్ వేసుకోవాలి. సాధ్యమైనంత వరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి. అత్యవసరమైతే తగిన రక్షణ కవచాలను ధరించి ప్రయాణం చేయవచ్చు. ఉబ్బసం వ్యాధితో బాధపడే వారు ఆల్కహాల్, ధూమపానానికి దూరంగా ఉండటంతో పాటు ఆహార నియమాలు పాటించాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులు చలితో నిమోనియా బారినపడే ప్రమాదం ఉన్నందున బయట తిరగకపోవడం మంచిది. గోరువెచ్చని నీటిని తాగడంతో జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. చిన్నారులు బయటకు వెళ్లేటప్పుడు ఉన్ని దుస్తులు వేయాలి. చలి తీవ్రతతో ఇంట్లో ఎవరికైనా జ్వరం, జలుబు బారిన పడితే సొంత వైద్యం మాని వైద్యులను సంప్రదించాలి.

- అమరచింత

చలికాలం.. చిరుధాన్యాలే మేలు

- పాలమూరు జనరల్ ఆస్పత్రి న్యూట్రిషనిస్టు శైలజ



చలి కాలంలో చిరుధాన్యాల వినియోగం, ఆకుకూరల సమాహారమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు పాలమూరు జనరల్ ఆస్పత్రి న్యూట్రిషనిస్టు శైలజ. ఆ వివరాలు ఆమె మాటల్లో.. శరీరానికి వేడిని అందించే ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిది. చిరుధాన్యాలు, ఆకుకూరలు తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎలాంటి అనారోగ్య సమస్యలూ రావు. శరీరంలో వేడిని పెంచేందుకు రాగులు, జొన్నల, కొర్రలతో చేసిన జావలు తాగడం మంచిది. తేనె, నిమ్మరసం కలిపిన గోరువెచ్చటి నీళ్లు తాగితే మలబద్ధక సమస్యతో పాటు శరీరం ముడతలు పడకుండా చూస్తుంది. రాగులు, సామ బియ్యం, మొక్కజొన్న, కొర్రలు, జొన్నలు, తోట కూర గింజలు, కోడిసామ, సజ్జలు వరిగెలు, నువ్వులు ఆరోగ్యకర ఆహారం. శీతాకాలంలో కండరాలు పట్టేయడం వంటి సహజ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. నువ్వులు తగిన మోతాదులో తీసకుంటే కాల్షియం, మాంగనీసు, ఇనుప ఖనిజాలు అందుతాయి. భోజనం తర్వాత నువ్వులతో చేసే మిఠాయిలు తినడం ద్వారా సరిపడా తేమ సమకూరుతుంది. వేరుసెనగతో గుండెకు మేలు. శీతాకాలంలో అందుబాటులో ఉన్న ఆకుకూరలన్నీ అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లనందిస్తాయి. ప్రతి రోజు ఆహారంలో తక్కువలో తక్కువ 400 గ్రాములు పండ్లు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి.



- పాలమూరు

‘సమగ్ర శిక్ష’.. సమ్మె బాట



జిల్లాకేంద్రంలో దీక్ష చేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలంటూ రిలే దీక్షలు

- కేజీబీవీల్లో స్తంభించిన బోధన
- డీఈఓ, ఎంఈఓ కార్యాలయాల్లో నిలిచిన డేటా ఎంట్రీ
- అయోమయంలో విద్యార్థుల చదువులు

అమరచింత: సమగ్రశిక్ష అభియాన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో విద్యాశాఖలో డేటా ఎంట్రీతో పాటు పర్యవేక్షణ, బోధన వ్యవహారాలు స్తంభించాయి. సమగ్రశిక్ష అభియాన్‌లో 11 విభాగాల ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో సీఆర్పీలు, సీఆర్టీలు, స్పెషల్ టీచర్లు, ఎంఎస్ఎస్ కార్యాలయ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, డీఈఓ కార్యాలయ సిబ్బంది, పీటీఐ, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు ఉన్నారు. వీరంతా జేఏసీగా ఏర్పడి తమ హక్కుల సాధన కోసం జిల్లా కేంద్రంలో వారం రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నారు. దీంతో విద్యావ్యవస్థలో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ వివరాల నమోదు ప్రక్రియ నిలిచిపోవడంతో ఎంఈఓలపై అదనపు భారం పడినట్లయింది. అలాగే కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో బోధన కొనసాగకపోవడంతో విద్యార్థులు కేవలం భోజనం చేయడం, పుస్తకాలను తిప్పేయడంతోనే కాలం వెల్లదీస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ గత ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని.. ప్రస్తుత ప్రభుత్వమైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ తమను క్రమబద్ధీకరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



అమరచింత ఎంఈఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ల కుర్చీలు

ఇవీ డిమాండ్లు..

- సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలి.
- అప్పటి వరకు ఉద్యోగ భద్రతతో కూడిన పేస్కేలు ఇవ్వాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి.
- ఉద్యోగ విరమణ చేయనున్న, చేసిన ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలి.
- సమగ్ర శిక్ష ఉద్యోగుల రీఎంగేజ్ విధానాన్ని తీసివేయాలి.
- మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలి.

చదువులు సాగడం లేదు..



వారం రోజులుగా పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులు కొనసాగడం లేదు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో చదువులు చెప్పేవారు లేకపోవడంతో కేవలం పుస్తక పఠనంతోనే గడిపేస్తున్నాం.

– తేజస్విని, 9వ తరగతి, కేజీబీవీ, అమరచింత

రివిజన్ మాత్రమే..



పాఠశాలకు రోజు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే వస్తున్నారు. ఎవరి తరగతి గదిలో వారిని కూర్చోబెట్టి చదువుకోవాలని చెబుతున్నారు. దీంతో గతంలో నేర్చుకున్న విషయాలు మర్చిపోయేలా ఉన్నాం.

– ఇందు, 9వ తరగతి, కేజీబీవీ, అమరచింత

జిల్లాలో 15 కేజీబీవీలు..

జిల్లాలో 15 కేజీబీవీలు ఉండగా.. 10 పాఠశాలల్లో 10వ తరగతి వరకు, మరో ఐదు పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కొనసాగుతోంది. ఆయా పాఠశాలల్లో మొత్తం 200 మంది సీఆర్టీలు విధులు నిర్వర్తిస్తుండగా 4,678 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. రిలే దీక్షల్లో సీఆర్టీలు పాల్గొనడంతో కస్తూర్బా విద్యాలయాల్లో చదువులు అటకెక్కాయి. కేవలం తినడం, పుస్తకాలను తిప్పేయడమే పనిగా మారిందని విద్యార్థులు తమ బాధను తెలిపారు.



అమరచింత కేజీబీవీలో ఉపాధ్యాయులు లేక పుస్తకాలు తిప్పేస్తున్న విద్యార్థులు

స్పష్టమైన హామీ ఇవ్వాలి..



25 ఏళ్లగా కనీస వేతనం లేకుండా విధులు నిర్వర్తిస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమను క్రమబద్ధీకరిస్తే వచ్చే బెనిఫిట్స్‌తో కుటుంబాన్ని పోషించుకునే వీలుంది. స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఉద్యమం ఆగదు.

– గంధం చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు, సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ

జిల్లాలో సమగ్రశిక్ష ఉద్యోగుల వివరాలు

విభాగం	కేజీబీవీ సిబ్బంది	పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు	ఐఈఆర్‌పీలు	అర్బన్ స్కూల్ ఉపాధ్యాయులు	భవిత కేంద్రాల కేర్‌టేకర్లు	ఎంఎంఎస్ కో-ఆర్డినేటర్లు	డేటా ఎంట్రీ ఆపరేటర్లు	ఎమ్మార్సీ మెసెంజర్లు	డీపీఓ సిబ్బంది
ఉద్యోగుల సంఖ్య	321	109	16	14	14	11	11	7	6

వేగంగా నల్లచెరువు అభివృద్ధి



నల్లచెరువు కట్టపై కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్

వనపర్తి: జిల్లాకేంద్రంలోని నల్లచెరువు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, పుర చైర్మన్ పి.మహేష్‌తో కలిసి చెరువుకట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. పట్టణ ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్, వ్యాయామం చేసుకునేలా కట్టను తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేసి ఇవ్వాలని పుర అధికారులను ఆదేశించారు. వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా గేట్ ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా సామగ్రి, ఇరువైపులా అందమైన మొక్కలు నాటాలన్నారు.

2022–23 రబీ ధాన్యం డబ్బులు చెల్లించాలి..

2022–23 రబీ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ ధాన్యం డబ్బులు చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో సహకరించిన మిల్లర్లకే భవిష్యత్‌లో ధాన్యం కేటాయింపులు చేస్తామన్నారు. సమావేశంలో డీఎస్ఓ కాశీ విశ్వనాథ్, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభం..

వనపర్తి టౌన్: హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని పుర కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని బుధవారం ఉదయం కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం రూ.కోట్ల విలువైన మామోగ్రామ్ యంత్రాలను జిల్లాకు తీసుకొచ్చారన్నారు. పుర పారిశుద్ధ్య మహిళా కార్మికులు, గ్రామాల్లోని క్యాన్సర్ అనుమానిత మహిళలను 102 వాహనంలో తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. సన చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సురభి సత్తయ్య, ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యురాలు, ఆదాయపన్ను శాఖ ప్రధాన కమిషనర్ సురభి నర్సమ్మ మాట్లాడుతూ.. మహిళలు కుటుంబంపై పెట్టే దృష్టి తమ ఆరోగ్యంపై ఉంచరని, ఆరోగ్యం క్షీణించాక బాధ పడుతుంటారన్నారు. మహిళలకు ఆరోగ్యపరంగా సాయం చేయాలనే ఉద్దేశంతో ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా పుర చైర్మన్ పి.మహేష్ ఆస్పత్రి యాజమాన్యానికి, సన చారిటబుల్ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు, కలెక్టర్ సతీమణి డా. నిపుణ్‌కుమారి, ఎంఎన్‌జే ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్‌రెడ్డి, డా. రామచంద్రరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ వైద్యంపై నమ్మకం పెంచాలి



అన్నారం సబ్‌సెంటర్‌లో అసంక్రమిత వ్యాధులపై ఆరా తీస్తున్న రాష్ట్ర బృందం

పాన్‌గల్: వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సరైన చికిత్స అందిస్తూ ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెంచాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ చెన్నై వైద్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు డా. మొగన్, డా. మాలతి అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీతో పాటు అన్నారం ఉప కేంద్రాన్ని వారు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రికార్డులు, హాజరు పట్టికలు, రక్తపోటు, మధుమేహం కేసుల స్క్రీనింగ్, పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అసంక్రమిత వ్యాధులు, అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ తోట శ్రీధర్, ఎన్‌సీడీ కార్యక్రమ జిల్లా అధికారి డా. రామచంద్రారావు, జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, డబ్ల్యూహెచ్ఓ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ రమేష్, పీహెచ్‌సీ వైద్యుడు డా. చంద్రశేఖర్, సీహెచ్ఓ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారి తల్లితో మాట్లాడుతున్న ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి డా. పరిమళ

పాన్‌గల్: చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా చూడాలని ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి డా. పరిమళ కోరారు. బుధవారం పాన్‌గల్, అన్నారం ఆరోగ్య ఉప కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నారంలో ఇల్లిల్లూ తిరిగి ఆర్‌ఐ సర్వే వివరాలు, పోషకాహార లోపం ఉన్న పిల్లల గురించి ఆరా తీశారు. అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారంపై చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడంతో రోగాలు దరి చేరవన్నారు. కార్యక్రమంలో జిల్లా హెచ్ఈఓ చంద్రయ్య, డా. మైత్రి, వైద్య సిబ్బంది రేవతి, నర్సమ్మ, నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆర్పీల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్పీలు

వనపర్తి రూరల్: తమకు జీఓనంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని బుధవారం తెలంగాణ రిసోర్స్ పర్సన్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఆర్పీలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో సుమారు 6 వేల మంది ఆర్పీలుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికి రూ.6 వేల వేతనం చెల్లించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆ వేతనాలు కూడా వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయకుండా సమైక్య ఖాతాల్లో జమ చేయడం ఏమిటని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతో పాటు వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమచేయాలని, డ్రస్‌కోడ్ అమలుచేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీలు, సీఐటీయూ నాయకులు నందిమళ్ల రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్లకు నిబంధనలు తప్పనిసరి



ఆత్మకూర్‌లో లే అవుట్ పత్రాలను పరిశీలిస్తూ వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఆత్మకూర్: ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ప్రజా అవసరాలకు అనుగుణంగా లే అవుట్లు రూపొందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కోరారు. బుధవారం ఆత్మకూర్ భార్గవీనగర్‌లో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. హద్దులు, విద్యుత్, ఇరిగేషన్, రోడ్లు తదితర వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనలను అతిక్రమిస్తే అనుమతులను రద్దు చేస్తామని తెలిపారు. అనంతరం మూలమళ్లలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. తర్వాత బాలకిష్టాపూర్‌లో కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య, భోజనం, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. సరుకులు వచ్చినప్పుడు మెస్ కమిటీ సంతకం తీసుకోవాలని, విద్యార్థుల సమక్షంలోనే సామగ్రి దించుకోవాలని, సరుకుల గడువు ముగింపు తేదీని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట ట్రాన్స్‌కో ఎస్ఈ రాజశేఖర్, ఏఈ నర్సింహ, ఇరిగేషన్ ఏఈ కిషోర్, ఆర్అండ్‌బీ డీఈ సీతారామస్వామి, తహసీల్దార్ చాంద్‌పాషా, పుర కమిషనర్ శశిధర్, టీపీఓ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

సర్సరీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు..

అమరచింత: గ్రామాల్లోని నర్సరీల నిర్వహణపై ఉపాధి సిబ్బందితో పాటు ఎంపీడీఓ, ఎంపీఓల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పాంరెడ్డిపల్లి, నందిమళ్లలో నర్సరీలను డీఆర్డీఓ ఉమాదేవితో కలిసి పరిశీలించారు. ప్రతి నర్సరీలో పదివేల మొక్కలు పెంచేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. నర్సరీల సంరక్షణ బాధ్యతను ఉపాధి కూలీలకు అప్పగించామని, ప్రతి నర్సరీకి ఇద్దరు వాచర్లను నియమించి ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరందించేలా కార్యాచరణ రూపొందించామని డీఆర్డీఓ వివరించారు. రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండుముఖం పడితే వాటిని తొలగించి కొత్త మొక్కలు నాటిస్తున్నామన్నారు. పంచాయతీ ట్యాంకర్‌తో రోజు హరితహారం మొక్కలకు నీటిని అందిస్తున్నమని వెల్లడించారు. ఆయన వెంట ఏపీడీ సుల్తాన్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ రఘు, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

చేయూత చిల్డ్రన్ హోమ్ సందర్శన..

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల శివారులో ఉన్న చేయూత చిల్డ్రన్ హోమ్‌ను బుధవారం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సందర్శించారు. వంటగది, నివాస, స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, వసతులు కల్పించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, పీవైసీ యాదమ్మ, నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి..

మహిళలు కుట్టుశిక్షణలో రాణించి స్వయం ఉపాధితో కుటుంబాలను పోషించుకోవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డీఆర్డీఓ, ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ద్వారా కొనసాగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. శిక్షణకు వచ్చిన మహిళలతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలరోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందించడంతో పాటు బ్యాంకు రుణాలు ఇప్పించి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఆయన వెంట డీఆర్డీఓ ఉమాదేవి, ఏపీడీ సుల్తాన్, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



నిర్లక్ష్యం చేయొద్దు.. జాగ్రత్తలు తీసుకోవాలి

- డా.యశ్వంత్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జిల్లా జనరల్ ఆస్పత్రి



చలిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. గొంతునొప్పి, చలి జ్వరం, ఆస్తమా, బ్రాంకైటీస్, నిమోనియా వ్యాపిస్తాయి. దుమ్ము నోట్లోకి చేరడం వల్ల పలు రకాల ఇన్‌ఫెక్షన్స్ వస్తుంటాయి. గాలిలో చల్లని తేమ వల్ల చిన్నారులకు త్వరగా జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతున్న సమయంలో ఇంట్లో వేడి పదార్థాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. చలి తీవ్రతతో వృద్ధుల్లో చేతులు వంకర పోవడం వంటి లక్షణాలు ఏర్పడి మరణిస్తారు. దీన్నే ఫ్రాస్ట్‌బైట్ అంటారు. వృద్ధుల్లో శరీరానికి కావాల్సిన ఉష్ణోగ్రతలు ఉత్పత్తి కాకపోవడంతో మరణాలు సంభవిస్తాయి. దీన్ని వైద్య పరిభాషలో హైపోథెరమి అంటారు. పొడి చర్మం కలిగిన వారిలో దురదలు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. గొంతు ఇన్‌ఫెక్షన్, కీళ్ల నొప్పులు పెరుగుతాయి. కొందరిలో తలనొప్పి వస్తుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది. కొంత మందిలో చలి కాలంలో కూడా పొక్కులు వస్తాయి. దీన్ని పాలీమార్ఫస్‌లైట్ ఎరప్షన్ అంటారు. ఎక్కువ సమయం నీళ్లలో చేతులను ఉంచి పనులు చేయడం వల్ల చేతిపై ఉండే నూనె పొర తొలగిపోతుంది. నూనె పొరను కాపాడుకునేందుకు ప్రయత్నించాలి.

- పాలమూరు



ఆస్తమా ప్రమాదకరం..

- డా.సందీప్, పల్మొనాలజిస్ట్



ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ఎక్కువ మంది అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. చలికాలంలో వాయుకాలుష్యం వల్ల ఆస్తమా సోకుతుంది. ఊపిరితిత్తులలో గాలి చేరడాన్ని అడ్డుకొని శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. ఒక్కోసారి ప్రాణం పోయిందనిపిస్తోంది. దీంతో పిల్లికూతలు, దగ్గు, ఆయాసం, చాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాతావరణంలో వచ్చే మార్పులు ఆస్తమా వ్యాధిగ్రస్తులను మరింత ఇబ్బందులకు గురిచేస్తాయి. పెద్దలతో పాటు పిల్లల్లోనూ జలుబు, దగ్గు, గొంతు సమస్యలు వస్తాయి. అల్ప ఉష్ణోగ్రతలను తట్టుకునేలా శరీరంలో వేడి ఉత్పత్తి అయ్యేందుకు జీర్ణవ్యవస్థ నిరంతరం పనిచేస్తుండాలి. ఇందుకోసం పీచు ఎక్కువగా ఉండే ఆహారం, తృణధాన్యాలు తీసుకోవాలి. పిల్లలకు ప్రొటీన్లు అధికంగా లభించే కోడిగుడ్లు తదితర పదార్థాలను అందజేయాలి. అప్పుడే శరీరంలో ఉష్ణోగ్రతలు సమతూకంలో ఉంటాయి. రోగనిరోధక శక్తికి నష్టం కలగకుండా చూసుకోవాలి. కేవలం ఆకుకూరలు, కూరగాయలే కాకుండా మూలికలు, సుగంధ ద్రవ్యాలను కూడా తీసుకోవాలి. మధుమేహం, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారు, పెద్ద వయస్కులు వారు ఉదయం వేళ నడకకు వెళ్లవద్దు. వీరు సాయంత్రం 4నుంచి 5గంటల మధ్య నడకకు వెళ్తే బాగుంటుంది. దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారు ఉదయం 8 గంటల వరకు బయటికి రావద్దు. చలికాలంలో వ్యాయామానికి బద్ధకించవద్దు. కనీసం 20 నిమిషాలైనా కసరత్తు చేయాలి.

- పాలమూరు

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డాకుల: మండలంలోని కాటవరం శివారులో జాతీయ రహదారి పక్కన సుమారు 35 నంచి 40 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మూడు, నాలుగు రోజుల క్రితం చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై కేవలం బూడిద రంగు నైట్ ప్యాట్ మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఠాణాలో సంప్రదించాలని కోరారు.

గద్వాలలో మరో వ్యక్తి మృతదేహం..

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించామని.. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు 40 ఉంటుందని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పతి మార్చురీలో భద్రపర్చామని.. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి



తేజ (ఫైల్)

మల్దకల్: గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన వీరన్న – సుజాత కుమారుడు తేజ (6)చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య వివరాల మేరకు.. సంగాలకు వీరన్న, అతడి భార్య సుజాత, కుమారుడు తేజతో కలిసి మోటారు సైకిల్‌పై మంగళవారం మల్దకల్ జాతరకు వెళ్లారు. జాతర ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మల్దకల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద అయిజ నుంచి గద్వాలకు వస్తున్న కారు వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. కర్నూలులో చికిత్స పొందుతూ తేజ మృతి చెందాడు. కారు డ్రైవర్ పరుశరాముడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



అయిజ: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చెరువులో బోల్తా పడిన ఘటన మండలంలోని చిన్న తాండ్రపాడులో బుధవారం చోటు చేసుకుంది. చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన రైతు భానుగౌడ్ తన ట్రాక్టర్‌ను పంట పొలానికి తీసుకెళ్తుండగా అదుపు తప్పి గ్రామ సమీపంలోని లింగమ్మ చెరువులో పడింది. ట్రాక్టర్ నడుపుతున్న భానుగౌడ్ అప్రమత్తమై ట్రాక్టర్ నుంచి కిందికి దూకడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

పని కోసం వెళ్లి.. శవమైన యువకుడు



పోల్‌శెట్టి శ్రీను (ఫైల్)

ఖిల్లాఘనపురం: తాపిమేస్త్రీ పనికోసం వెళ్లిన ఓ యువకుడు మూడు రోజుల తర్వాత శవమై గ్రామానికి వచ్చిన ఘటన ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పోల్‌శెట్టి చిన్న చెన్నయ్య, వెంకటమ్మల రెండవ కుమారుడు శ్రీను (33) సోమవారం మేస్త్రీ పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి టీవీఎస్‌పై బయలుదేరాడు. మంగళవారం ఉదయం నాటికి అతడు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు.. తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికారు. ఇదిలా ఉండగా.. భూత్పూర్ మండలం పాత మొల్గర వాగు వద్ద మూడు రోజులుగా టీవీఎస్ వాహనం ఆగి ఉండటం.. అక్కడ బట్టలు ఉండటంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు బుధవారం అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని టీవీఎస్ నంబర్ ఆధారంగా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పోల్‌శెట్టి శ్రీను వాహనంగా గుర్తించి, ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో మొల్గరకు చేరుకొని వాగులో గాలించారు. నీటిలో చేపల వల కాళ్లకు చుట్టుకుని శ్రీను చనిపోయి కనిపించాడు. చేపలు పట్టేందుకు వెళ్లి మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హైవేపై దారి దోపిడీ



పెబ్బేరు పట్టణ శివారులోని జాతీయ రహదారి 44పై దారి దోపిడీకి గురైన కారు ఇదే..

కత్తులు, రాళ్లతో దాడి చేసిన దుండగులు

- 14 తులాల బంగారు నగలు చోరీ
- నలుగురికి గాయాలు.. బాధితులు జగిత్యాల వాసులుగా గుర్తింపు
- వనపర్తి జిల్లా పెబ్బేరు శివారులో సంఘటన
- ఐదు బృందాలతో విచారణ

వనపర్తి: గుర్తు తెలియని ఐదుగురు దుండగులు రోడ్డుపక్కన ఆగి ఉన్న యాత్రికుల వాహనంపై దాడిచేసిన సంఘటన బుధవారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ శివారులో 44వ నంబర్ జాతీయరహదారిపై చోటు చేసుకుంది. బాధితులు, డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం తీర్థయాత్రలకు తిరుపతి, అరుణాచలం, కంచి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం తెల్లవారుజామున పెబ్బేరు పట్టణ శివారులోని ఎంవీఐ కార్యాలయం ఎదుట ఎడమ వైపు ట్రక్ పార్కింగ్ వద్ద వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకున్నారు. వారు గాఢనిద్రలో ఉండగా.. గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు స్వెటర్లు, మాస్కులు ధరించి రాళ్లు, కత్తులతో దాడి చేశారు. కారులో ఉన్న వారు వాహనాన్ని స్టార్ట్ చేసి వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ.. దుండగులు ఆ వాహనం వెనక టైర్‌కు అడ్డంగా పెద్దరాళ్లు పెట్టడంతో సాధ్యం కాలేదు. రోడ్డుకు కుడి వైపు ఉన్న టాయిలెట్స్ శుభ్రం చేసే వ్యక్తి.. గదిలో నిద్రిస్తున్నట్లు గమనించిన దుండగులు దాడి చేసే సమయంలో నిద్ర లేచే అవకాశం ఉందని అతను బయటికి రాకుండా గదికి గడియపెట్టారు. కారుపై ఉంచిన యాత్రికుల వస్తువులు, బ్యాగులను ఎత్తుకెళ్లడంతో పాటు కారులోని మహిళల మెడల్లో ఉన్న బంగారం గొలుసులను బలవంతం లాక్కున్నారు. కారులో మొత్తం ఎనిమిది మంది ఉండగా.. వారిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. డ్రైవర్ ప్రణీత్‌పై రాళ్లు, కత్తితో దాడి చేయగా అతను అక్కడే స్పృహ కోల్పోయాడు. మిగతా వారు దాడి చేసే వారిని ప్రతిఘటించే ప్రయత్నం చేసినా.. వారు రాళ్లతో దాడి చేయడంతో అడ్డుకోలేకపోయారు. మహిళల వంటిపై ఉన్న సుమారు 14 తులాల బంగారునగలను అపహరించుకుని వెళ్లారు. బాధితులు 100కు డయల్ చేయటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌కు రప్పించి గాయాల పాలైన వారిని వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. జీజీహెచ్‌లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో సంతోష్, రాజేశ్వర్‌తో పాటు డ్రైవర్ ప్రణీత్, బాలుడు శ్రీకాంత్ ఉన్నారు. మహిళలు సునీత, సరస్వతి, రజినిల మెడల్లోని గొలుసులను బలంగా లాగటంతో వారికి మెడ భాగంలో స్వల్ప రక్తగాయాలయ్యాయి.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రావుల గిరిధర్

విషయం తెలుసుకున్న ఎస్పీ రావుల గిరిధర్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రాంబాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.వాహనంలో పడి ఉన్న రాళ్లు, సంఘటన స్థలంలో పడేసిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు రప్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి సీఐ రాంబాబు నేతృత్వంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్లపైకి ఆర్డీఎస్ నీరు

- కోతకు గురైన డీ–30 కాల్వ

మానవపాడు: ఆర్డీఎస్ కాల్వ కోతకు గురై నారాయణపురం గ్రామంలో బుధవారం రోడ్లపై ఆ నీరు ప్రవహిస్తోంది. మండలంలోని నారాయణపురం గుండా డీ–30 కాల్వ వెళ్తుంది. కాల్వలో పూడిక తీయకపోవడంతో నీరు ఎక్కువై గ్రామంలో ప్రవహిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నారాయణపురం గ్రామంలో ప్రవహిస్తున్న ఆర్డీఎస్ కాల్వ నీరు.

చిన్నరాజమూర్‌కి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకారంలో ఆంజనేయ స్వామి



దేవాలయ ప్రధాన ద్వారంవద్ద భక్తులు

- దాసంగాలతో నైవేద్యాల సమర్పణ


దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి దాసంగాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఆవులను, కోడేలను ఆలయానికి అందజేశారు. పోర్లు దండాలు, గండజ్యోతులతో ప్రదక్షిణలు చేశారు. కోనేరు వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. నీటిలోకి వెళ్లకుండా ప్రత్యేకంగా ఇనుప జాలీలతో కంచెను ఏర్పాటుచేశారు. దేవస్థానం వారు పులిహోర, లడ్డు ప్రసాదాలను విక్రయించారు. జాతరలో స్వీట్లు షాపులు, గాజులు, బొమ్మల షాపులు వెలిశాయి. జోరుగా వ్యాపారాలు కొనసాగాయి. రెండు వారాలు జాతర కొనసాగే అవకాశముంది. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అంజన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పూజారులు

మూడు ఇళ్లలో చోరీ

- బంగారు, వెండి వస్తువుల అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని విలియం కొండతండాలో బుధవారం రాత్రి మూడు ఇళ్లలో దొంగతనం జరిగినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. తండాకు చెందిన ముడావత్ రవి నాయక్, రాత్లావత్ రాజు, రాత్లావత్ బాబు ఇళ్లకు తాళాలు వేసి హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. బుధవారం ఉదయం పక్కింటి వారు తాళాలు తీసి ఉండటం గమనించి ఆయా ఇళ్ల వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న వారు ఇళ్లలోకి వెళ్లి చూడగా బీరువాల తలుపులు పగులగొట్టి ఉండటం.. అందులోని బంగారు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి పరిశీలించి జిల్లాకేంద్రం నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రాష్ట్రంలోకి కర్ణాటక వరి ధాన్యం?

మాగనూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి కర్ణాటకలోని బద్దేపల్లి, అజిలాపూర్, దుప్పలి, ఇడ్లూరు తదితర గ్రామాల నుంచి నిత్యం ట్రాక్టర్లలో వరి ధాన్యం వస్తోందని.. వారికి కార్యాలయంలోని ఓ అధికారి సహకరిస్తున్నారని మండల ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఇక్కడి గన్నీ బ్యాగులను కర్ణాటకకు పంపించి గుట్టు చప్పుడు కాకుండా తీసుకొస్తున్నారని తెలుస్తోంది. మండలంలోని తాళంకేరి దగ్గర చెక్‌పోస్టు లేకపోవడంతో ఇదే అదునుగా భావించి ధాన్యాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కర్ణాటక కంటే ఇక్కడ ధర అధికంగా ఉండటం.. అదనంగా బోనస్ వస్తుండటంతో ఈ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి పోలప్ప వద్ద ప్రస్తావించగా కర్ణాటక నుంచి వరి ధాన్యం వస్తున్నట్లు తమ దృష్టికి బుధవారం వచ్చిందని.. ఈ విషయంపై దృష్టి సారించామని, అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

నాగర్‌కర్నూల్ క్రైం: తనకు న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన ప్రవీణ్, నూర్జహాన్ చాలారోజులుగా ప్రేమించుకుంటున్నారు. వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఆమె షీటీంను ఆశ్రయించింది. షీటీం ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపించగా ఇటీవలే విడుదలయ్యాడు. తాజాగా బుధవారం నూర్జహాన్ ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కేసు కోర్టులో ఉందని తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని సముదాయించి పంపించారు.

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలి



ఫుట్‌బాల్ విన్నర్, రన్నర్ జట్లతో అధికారులు, పీడీలు

- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలు బుధవారం మూడోరోజుకు కొనసాగాయి. ఆర్చరీ, ఫుట్‌బాల్, తైక్వాండో, కరాటే పోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఫుట్‌బాల్ పోటీలకు వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

జాతీయస్థాయికి ఎదగాలి

జిల్లా క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎదగాలని పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో సీఎం కప్ జిల్లాస్థాయి కరాటే ఎంపికలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో టీజీ పీడీ, పీఈటీల సంఘం అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి విలియం, పీడీలు వేణుగోపాల్, నిరంజన్‌రావు, వడెన్న, పరశురాం, భానుకిరణ్, మొగులాల్, కృష్ణ, ఉమాదేవి, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్‌పీ.వెంకటేశ్

నేడు ముగియనున్న జిల్లాస్థాయి క్రీడలు

సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలు గురువారం ముగియనున్నాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, బాక్సింగ్ క్రీడలతోపాటు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సాయంత్రం ముగింపు వేడుకలు నిర్వహించి విజేత జట్లకు ట్రోఫీలు అందజేయనున్నారు.

కరాటే ఎంపికల వివరాలు

జిల్లాస్థాయి కరాటే ఎంపికల్లో 14–15 ఏళ్ల విభాగం – 52కేజీలో శివప్రసాద్, –57కేజీలో శ్రీకర్‌రెడ్డి, –63కేజీలో విశాల్, 63కేజీలో తేజవర్ధన్, 47కేజీలో షాఫియా తస్లిం, 54కేజీలో గాయత్రి, 54కేజీలో వైష్ణవి.

- సీనియర్–18 ఏళ్లపైబడి విభాగం 55కేజీలో ఎండి.అర్ష్ జమీల్, 60కేజీలో మొయినోద్దీన్, 75కేజీలో లక్ష్మణ్, +75కేజీలో హుజేఫ్ షరీఫ్, –55కేజీలో డి.వీణ,
- జూనియర్ 16–17 ఏళ్ల విభాగం 55కేజీలో అభిలాష్, 61కేజీలో బాలే షరీఫ్, 63కేజీలో చందు, 53కేజీలో మహిమాన్విత, 59కేజీలో ఐశాతస్లీంలు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు క్రిష్ణయ్య, తాజుద్దీన్, ఇలియాజ్, శంకర్‌నాయక్, సాలం బిన్ ఉమర్, శివకుమార్, నవీన్‌కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత మహబూబ్‌నగర్

జిల్లాస్థాయి సీఎం కప్ ఫుట్‌బాల్ సీనియర్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 2–1 గోల్స్ తేడాతో జడ్చర్లపై జట్టుపై విజయం సాధించింది. బాలికల విభాగంలో జడ్చర్ల జట్టు 2–0 గోల్స్‌తో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందింది.

ఆర్చరీ ఫలితాలు

ఆర్చరీ బాలుర కాంపౌండ్‌లో ఎన్.విష్ణువర్ధన్, బాలికల్లో ఆర్.సుజాత, ఇండియన్ రౌండ్ బాలురలో రామావత్ రవి, బాలికల్లో కె.సునీత విజేతలుగా నిలిచారు.

దిగి వచ్చిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.3,610.. కనిష్టంగా రూ.1,700



విక్రయానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం జరిగిన ఉల్లి వేలంలో ధరలు తగ్గుముఖం పట్టాయి. నాలుగు వారాలుగా పెరిగిన ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. కర్ణాటక, మహారాష్ట్రా నుంచి హైదరాబాద్, కర్నూలు ప్రాంతాలకు ఉల్లి దిగుమతి కావడంతో ధరలు తగ్గాయి. గత వారం గరిష్టంగా రూ.5,100 వరకు ఉండగా.. ఈ వారం రూ.3,610 పలికింది. అంటే ఏకంగా రూ.1,500 వరకు తగ్గింది. కనిష్టంగా రూ.1,700 ధర నమోదైంది. గత వారం కనిష్టంగా రూ.3,100 ధర ఉండగా.. సుమారు రూ.1,400 వరకు తగ్గింది. 45 కిలోల బస్తా గరిష్టంగా రూ.1,800, కనిష్టంగా రూ.850కి విక్రయించారు.

శ్రీశైలం జలాశయంలోకి 7,870 క్యూసెక్కులు పంపింగ్

దోమలపెంట: భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతి ద్వారా 24 గంటల వ్యవధిలో సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి 7,870 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేశారు. జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్ఎస్‌ఎస్‌కు 1,695, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బుధవారం శ్రీశైలం జలాశయంలో 863.4 అడుగుల వద్ద 116.6364 టీఎంసీల నీటినిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

క్లుప్తంగా

కొత్తకోట ఎస్‌ఐగా బి.ఆనంద్



కొత్తకోట రూరల్: కొత్తకోట పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌ఐగా బి.ఆనంద్ బుధవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. మహబూబ్‌నగర్ సీసీఎస్‌లో విధులు నిర్వహించిన బి.ఆనంద్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇంతకు ముందు గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇక్కడ రెండేళ్ల పాటు పనిచేసిన ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సాధారణ బదిలీలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయం వీఆర్‌కు అటాచ్ చేశారు. మండలంలో శాంతిభద్రతల విషయంలో ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎస్‌ఐ ఆనంద్ కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ఖిల్లాఘనపురం: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ వినియోగం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కొందరు వ్యక్తులు ఎలాంటి పనులు చేయకుండా ప్రజలను మోసగించి ఈజీగా డబ్బులు సంపాదించే దారులు వెతుకుంటున్నారన్నారు. రుణాలు మంజూరయ్యాయని సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీ చెప్పాలని కాల్ చేసే వారికి వ్యక్తిగత వివరాలు అందించొద్దన్నారు. ఎవ్వరికీ కూడా ఓటీపీలు, పిన్ నంబర్లు చెప్పడం, అనవసర లింక్‌లు ఓపెన్ చేయరాదని సూచించారు. ఈ విషయాలను తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అర్థం అయ్యే విధంగా అవగాహన కల్పించాలని విద్యార్థులకు చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఆనంద్, విజయ్‌కుమార్, బాలీశ్వర్, చంద్రశేఖర్, యాదయ్య, రజినికాంత్‌రెడ్డి, శ్రీకాంత్, పద్మకుమారి, మంజుల, లలిత, ఆసియా తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



వనపర్తి టౌన్: ధర్మ సమాజ్ పార్టీ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు నెలలుగా జిల్లా వ్యాప్తంగా వివిధ రూపాల్లో పేద, మధ్య తరగతి ప్రజలైన 93శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, ఎకరం భూమి కల్పించాలనే డిమాండ్‌తో ఆ పార్టీ నిర్వహించిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు అర్ధరాత్రి తొలగించి, నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని నాయకుడు వీరపాగ రామకృష్ణ మహారాజ్ అన్నారు. పోలీసుల చర్యను నిరసిస్తూ డీఎస్పీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలపై ప్రేమ, గౌరవం ఉంటే తక్షణమే ప్రస్తుతం నడుస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో పేద కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపాగ అశోక్, కార్యదర్శి కురుమన్న, జిల్లా నాయకులు ఎల్లయ్య, బలరాం, రవి, విజయ్, లక్ష్మణ్, తారక్, మధు పాల్గొన్నారు.

గోపుర నిర్మాణానికి రూ.1.80 లక్షల విరాళం



రాజోళి: మండల కేంద్రంలోని భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న మహాగణపతి ఆలయ గోపుర నిర్మాణానికి రాజోళి మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.1.80లక్షల విరాళాన్ని బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు కలశానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా, దాతలు కలశాన్ని తలపై పెట్టుకుని అర్చకుల వేద మంత్రాల నడుమ ఆలయంలోకి తీసుకొచ్చారు. ఆలయ నిర్మాణంలో, గ్రామ అభివృద్ధిలో తమ కుటుంబ సభ్యులు ముందుంటామన్నారు.

పొగమంచుతో ప్రమాదం





- రఘుకుమార్, ఆర్టీఓ, మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ క్రైం: చలికాలంలో రాత్రి వేళల్లో కురిసే పొగమంచుతో ఎదురుగా వచ్చే వాహనాలు, మనుషులు సైతం కనిపించని పరిస్థితి. రోడ్డుపై పూర్తిగా మంచు కమ్ముకొని ఉండి ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించే లోపు ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపేయడం ప్రమాదకరం. వెనుక నుంచి కానీ ఎదురుగా కానీ వచ్చే వాహనాలను గమనించక ఢీకొనే సంఘటనలు తరచూ జరుగుతుంటాయి. ఒక్కోసారి విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. వాహనాలకు వెనుక, ముందు రేడియం స్టిక్కర్లు అంటించుకోవడం చేయాలి. వాహనానికి ఫాగ్ ల్యాంప్స్ ఏర్పాటు చేసుకోవాలి. పసుపు రంగుతో వెలిగే లైట్స్ ఈ చలికాలంలో ఎంతో ఉపయోగపడుతాయి.ఈ కాలంలో రాత్రివేళ, వేకువజామున ప్రయాణాలను తగ్గించుకుంటే మంచిది. మంచు ఎక్కువగా కురుస్తున్న సమయంలో వాహనదారులు పలు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు జరగకుండా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. వేగం తక్కువగా ఉండటంతో పాటు వాహనం పూర్తిగా కండీషన్‌లో పెట్టుకోవడం, ఇంజిన్, టైర్లు, ముందు అద్దాలు సరిగ్గా ఉండే విధంగా చూసుకోవాలి.

జాగ్రత్తలతో పశువులను కాపాడుకోండి

- డాక్టర్ మధుసూదన్‌గౌడ్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి





మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తగిన జాగ్రత్తలతో పశుపక్షాదులను కాపాడుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.మధుసూదన్‌గౌడ్ అన్నారు. రోజురోజుకు తగ్గుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో బుధవారం 'సాక్షి'తో పశువులు, పెంపుడు జంతువుల సంరక్షణపై ఆయన సూచనలు, సలహాలు చేశారు.

- శీతాకాలంలో పాడి పశువుల ఆరోగ్యం విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో జీర్ణవ్యవస్థ మందగించడం, పోషకాలు తగ్గి పాల ఉత్పత్తి తగ్గుతుంది.
- ఈదురు గాలుల నుంచి రక్షించేందుకు గోనె సంచులు, ఖాళీ ఎరువుల సంచులతో పాక చుట్టూ పరదాలు ఏర్పాటుచేయాలి. పాక లోపల దోమల నివారణకు వరి పొట్టుతో కుంపట్లు లేదా లావు కట్టెలను మండించాలి. వేపాకు పొగను ఓ మూలన వేయాలి.
- దూడలను చలి నుంచి రక్షించేందుకు గోనె సంచితో లేదా పాత బట్టలతో డ్రెస్‌లాగా కుట్టించి తొడిగించాలి.
- మేత కోసం తెల్లవారుజామున కాకుండా ఎండ వచ్చేవేళ బయటకు వదలాలి. పరిశుభ్రమైన ఆహారం, నీరు అందించాలి. పశువుల్లో జీర్ణక్రియ మందగించకుండా పచ్చిమేతతో పాటు ఒట్టిమేతను కూడా ఇవ్వాలి.

ధనుర్మాసం.. భక్తిమార్గం

- నెల రోజుల పాటు కొనసాగునున్న పూజలు
- నిత్య పూజలు, అర్చనలతో ఆలయాలు కిటకిట



వనపర్తిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

వనపర్తి టౌన్: జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీరంగపురం మండల కేంద్రంలోని శ్రీరంగనాయకస్వామి, వనపర్తి వేంకటేశ్వర, రుక్మాబాయి సమేత పాండురంగ విఠలేశ్వర, కొత్తకోట వేంకటేశ్వర ఆలయంలో వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నెల రోజుల పాటు చేస్తారు. వివాహం కోసం, దారిద్ర్య నిర్మూలనకు, పరమాత్ముడికి చేరువయ్యేందుకు ధనుర్మాసం పూజలు ఫలిస్తాయని భక్తుల విశ్వాసం. కొన్ని ఆలయాల్లో ఏకాదశి వేడుకల వరకే ఉత్సవాలు ముగించే సంప్రదాయం ఉంది. తొలి పూజలు చేపట్టి గోదాదేవి పల్లకీ సేవ, కృష్ణపరమాత్మ అర్చన, మార్గళి తిరుప్పావై పర్వాలను నిర్వహించడంతో పాటుగా అయ్యల్లూరి రఘునాథాచార్యులు ప్రవచనం అందించారు. ధనుర్మాస నోముల కోసం వనపర్తిలోని వేంకటేశ్వర, పాండురంగ, శ్రీరంగనాయకస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి ముందుగా గోదాదేవి తన మనో వల్లభుడైన శ్రీరంగనాథుడిని సేవించి, ప్రసన్నం చేసుకునేందుకు చేపట్టే నోము పర్వాలను విశేషంగా ఆరాధిస్తారు.

నిత్యారాధన

సోమవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 13 వరకు పల్లకీసేవ, విశేష ఉత్సవాలు, గోత్రనామాలతో అర్చనలు, పంచామృతం, నెయ్యితో ప్రత్యేక అలంకరణ, పుష్పాలంకరణ తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ ధనుర్మాస వేడుకల్లో పుణ్యప్రదంగా భక్తులు భావించే వైకుంఠ ఏకాదశి పర్వదినం రానుంది. అంతే కాకుండా నాలుగు వారాలు ఉదయం 9 గంటలకు శ్రీవారి పారాయణాలను పఠిస్తారు.

విశేష పూజలు

వచ్చే జనవరి 10న వైకుంఠ ఏకాదశి ఉదయం 4 గంటల నుంచి గరుడ వాహన సేవతో పాటుగా ఉత్తర ద్వార పూజ దర్శనం కల్పిస్తారు. వేంకటేశ్వర, పాండురంగ స్వాముల విశేష అలంకారణ, గోదాదేవి అమ్మవారికి 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిరాటోత్సవం, కూడారై ఉత్సవాల్లో భాగంగా 108 గంగా జలములతో పాలచక్కెర పొంగలి (పాయస) నివేదన, గోదా, రంగనాయకల స్వామి కల్యాణోత్సవం, మకర సంక్రమణం, ఉదాయాది ఉత్తరాయణ పుణ్యకాలంలో ఉదయం 6 గంటలకు ఆదిత్య శ్లోక పఠనం సామూహికంగా, ప్రత్యేక పూజలు చేస్తారు.

పుణ్యప్రదం..



ధనుర్మాసం భక్తులకు పుణ్యప్రదంగా భావిస్తారు. ఈ మాసంలో భగవంతుడి ఆరాధనతో విశేష ఫలితాలను పొందవచ్చు. ప్రతిరోజు ప్రత్యేక సేవ కార్యక్రమాల్లోనూ భక్తులు పాలుపంచుకోవచ్చు. భక్తిపరంగానే కాకుండా సైన్స్‌పరంగా కూడా ధనుర్మాసం ఫలప్రదం.

- అయ్యల్లూరి రఘునాథాచార్యులు, వనపర్తి ఆలయ, ధర్మకర్త

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అమరచింతలో..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం బుధవారం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప మాలధారులు మండల కేంద్రంలోని కమ్మరిగేరి శివాలయంలో బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. 39 మంది మాలధారులకు గురుస్వాములు చెన్నయ్య, రామకృష్ణగౌడ్, అంజనేయులు, రాములు ఇరుముడి కట్టారు. అనంతరం దేవాలయంలో పడిపూజ కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 18 మెట్లను పూలు, పండ్లు, గంధం, కుంకుమ తదితర వాటితో అందంగా అలంకరించి మెట్లపై స్వామివారి విగ్రహం ఏర్పాటు చేశారు. అంతకు మందు స్వామికి అభిషేకం, అష్టోత్తరం పూజలు చేశారు. ఆలయం వద్ద దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

అయ్యప్ప మాలధారులకు భిక్ష..

అమరచింత: పట్టణానికి చెందిన దుబాయి వెంకటేశ్వర్‌రెడ్డి అయ్యప్ప మాలధారులకు బుధవారం భిక్ష ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం అయ్యప్ప ఆలయంలో మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగానే ఈ సంవత్సరం తన వంతు సాయంగా ఆలయానికి వాటర్ ఫిల్టర్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు నరసింహులు గౌడ్, కమలాకర్‌గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో మాలధారులకు ఇరుముడి కడుతున్న గురుస్వాములు

ధర్నాను జయప్రదం చేయండి

పాన్‌గల్: గొల్ల, కురుమలు ఎదుర్కొంటున్న సకల సమస్యల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద గురువారం నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, జిల్లా నాయకులు రామకృష్ణయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి కురుమ ప్రజా ప్రతినిధులు, మేధావులు, విద్యావంతులు, సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు చేయాలి



వీపనగండ్ల: పసిపిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా తరుచూ వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడే వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువ ఉన్న పిల్లలను పరీక్షించి అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పోషక విలువలతో కూడిన పదార్థాలను పసిపిల్లలు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు.

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఖిల్లాఘనపురంలో ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ గణేష్‌ను కలిసి వేతనాలు ఇవ్వడంతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు గట్టమ్మ, మజీద్ మాట్లాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీలో పనులు చేస్తున్న తమకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. వెట్టి చాకిరీ చేస్తున్న తమకు వేతనాలు ఇవ్వకుంటే పూట గడిచేది ఎలా అని ప్రశ్నించారు. అదేవిధంగా కార్మికులకు సబ్బులు, నూనెలు ఇవ్వడంతో పాటు గడ్డపార ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్లతో నిరసన వ్యక్తం చేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఖిల్లాఘనపురం: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు శ్రీనువాసులు, పుష్ప, సరిత తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మండల కార్యాలయాల సముదాయం ఆవరణలో ఉదయం నుంచి అన్ని గ్రామాల పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు దీక్ష చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ వెంకటాచారికి ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు రాములు, సాయిలమ్మ, బాలమ్మ, విజయలక్ష్మి, కుర్మమ్మ, నాగమ్మ, లక్ష్మమ్మ, గంగాదేవి, అంజలమ్మ, జయమ్మ, చిన్నయ్య, పద్మమ్మ, వెంకటయ్య, పోషమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెద్దమందడిలో..

ధాన్యం టోకన్లకు రైతుల పడిగాపులు



పాన్‌గల్ రైతువేదికలో టోకన్ల కోసం గుమిగూడిన రైతులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో ధాన్యం టోకన్ల కోసం బుధవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు బారులు తీరారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు ఆయా గ్రామాల ఏఈఓలు ధ్రువీకరణ పత్రం అందజేస్తేనే ధాన్యం కాంటా చేస్తుండటంతో వాటికి సంబంధించిన టోకన్లను పొందేందుకు పాన్‌గల్, మాందాపూర్, దావాజీపల్లి, వెంగళాయిపల్లి, కదిరెపాడు, మాధరావుపల్లి, శాగాపూర్, కొత్తపేట, బహుదూర్‌గూడెం, కేతేపల్లి, జమ్మాపూర్, చిక్కేపల్లి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతువేదికలో గుమిగూడారు. వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏఈఓలు టోకన్లు రాసి ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు శైలజ, అఖిల, షర్మిలాదేవి, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న దాత, ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాత బాదగొని శారదకుమార్‌గౌడ్ ఆర్థిక తోడ్పాటుతో అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పాఠశాలలో దాతతో కలిసి విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జిల్లాలోనే పది విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేసిన మొదటి పాఠశాల అని పేర్కొన్నారు. ఆర్థిక తోడ్పాటు అందించిన దాతలకు ప్రత్యేక అభినందలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం సెక్యానాయక్, బాదగొని ప్రవళిక, ఏపీసీ చైర్మన్ కవిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజపల్లిలో పశువైద్య శిబిరం



పాడి రైతులకు సూచనలిస్తున్న పశువైద్యులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి గోపాలమిత్ర కేంద్ర పరిధిలోని బలిజపల్లిలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్యామ్ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది గ్రామంలో తిరుగుతూ గేదెలు, ఆవులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కీర్తి, రమేష్, జేవీఓ జగదీష్, మాన్‌కైండ్ పర్యవేక్షకులు అభిషేక్, గోపాలమిత్ర రాఘవేంద్రరెడ్డి, పశువైద్య సిబ్బంది కాంతారావు, కొండన్న, మాధవయ్య, సూపర్‌వైజర్ జయసింహ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం



వీపనగండ్లలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకునే వెసులుబాటు కలుగుతుందని ఏఐసీసీ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లికి చెందిన హరికృష్ణకు రూ. 22వేలు, బలిజపల్లికి చెందిన విట్టా సంజీవరెడ్డికి రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జిల్లెల ఆదిత్యారెడ్డి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడానికి కృషి చేసిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలచంద్రి, పెద్దమందడి మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటన్న, యాదయ్య, రఘు ఉన్నారు.



బలిజపల్లిలో చెక్కు అందజేస్తున్న జిల్లెల ఆదిత్యారెడ్డి

10 మందికి..

వీపనగండ్ల: వివిధ రకాల అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 10 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిన రూ.2.9లక్షల విలువగల చెక్కులను బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. బొడ్డుపల్లి నర్సింహకు రూ.50 వేలు, కానమోని శ్రీనివాసులకు రూ.35 వేలు, బొడ్డుపల్లి విష్ణుకు రూ.33 వేలు, శ్రీనివాసులు రూ.23,500, జిల్లు సోనికి రూ.23,500, కేతేపల్లి శ్రీనుకు రూ.15 వేలు, జ్యోతి రూ.12 వేలు, పెంటయ్య రూ.6వేలు, మీసాల బాలమ్మకు రూ.6 వేలు, ఎల్లమ్మకు రూ.5,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎత్తం కృష్ణయ్య, మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కావలి మహేష్, పోతుల వెంకట్‌రెడ్డి, గోపి, రవీందర్‌రెడ్డి, యాదయ్య, విష్ణు, వెంకటయ్య, బాలపీరు పాల్గొన్నారు.



దావాత్‌ఖాన్‌పల్లిలో..

పాన్‌గల్: మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లికి చెందిన కొంకల రాములమ్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.11,500 చెక్కును బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషిచేసిన మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొంకల రాజవర్ధన్, రోషన్న, కొంకలరాజు, జనార్దన్, నాగరాజ్, అశోక్, ప్రకాష్, లక్ష్మణ్, సురేష్ పాల్గొన్నారు.

'భూ భారతి'తో రైతులకు ప్రయోజనం

కొత్తకోట రూరల్: గత ప్రభుత్వం 2020లో తెచ్చిన ధరణ పోర్టల్‌ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భూ భారతి 2024 కొత్త చట్టం అమలులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొత్త ఆర్‌ఓఆర్ చట్టాన్ని తీసుకురావడంపై కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఒక చారిత్రాత్మకమైన రోజని, మనిషికి భూమికి వీడదీయరాని అనుబంధమని, భూమి ఉంటే ఆత్మగౌరవంతో బతికే అవకాశం వస్తుందన్నారు. ధరణి చట్టం వల్ల మూడేళ్లలో రైతులకు లక్షలాది సమస్యలు తీసుకొచ్చారని మండిపడ్డారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సాఫ్ట్‌వేర్‌లో అవకతవకలు జరిగి చాలామంది రైతులు భూములు కోల్పోయారన్నారు. కొత్త చట్టంతో సామాన్య ప్రజలకు ఇబ్బంది ఉండకుండా కొత్త చట్టం తీసుకురావడం, తప్పులు పునరావృత్తం కాకుండా మేధావులతో చర్చించి ఈ చట్టం తేవడంపై భూమికి పూర్తి భద్రత కల్పించినట్లవుతుందన్నారు. ధరణి వల్ల 18.26లక్షల ఎకరాలు పార్ట్-బీలో ఉండటం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలు రైతులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు.